క్లుప్తంగా

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు



వెంకటాపురం(కె): గ్రామాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. మండలంలోని 18 పంచాయతీల్లో ఏర్పాటు చేసినప్పటికీ క్రీడా ప్రాంగణాల్లో సరైన క్రీడా సామగ్రిని ఏర్పాటు చేయక పోవటంతో అవి యువతకు క్రీడాకారులకు ఉపయోగపడకపోగా నిరుపయోగంగా మారి క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమైయ్యాయి. ఇప్పటికైనా అధికారులు క్రీడా ప్రాంగణాల్లో సరైన వసతులు కల్పించడంతో పాటు క్రీడా సామగ్రిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ



మహాముత్తారం: మహాముత్తారం ఎస్సైగా ఆదివారం మహేందర్‌కుమార్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను జిల్లా ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు.

ఎస్సైకి సన్మానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పీవీఎస్ భవానిసేన్‌ను కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెంగాని అశోక్, నాయకులు గండెసిరి సత్యనారాయణ, గండెసిరి మధుసూదన్, మంగాయి లక్ష్మణ్ ఉన్నారు.

గట్టమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో గల మినీ మేడారం సమ్మక్క–సారక్క జాతరలో నూతనంగా నిర్మించిన గట్టమ్మ దేవాలయంలో గట్టమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా విగ్రహానికి అర్చకుడు కూర్మాచలం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. జగ్గయ్యపేట ఎంపీటీసీ దుగ్యాల సునీత రాజేశ్వర్‌రావు దంపతులు విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం కన్వీనర్‌గా సమ్మయ్య

మల్హర్: అంబేడ్కర్ యువజన సంఘం అడక్ కమిటీ మండల కన్వీనర్‌గా మంతెన సమ్మయ్యను ఆదివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో సమ్మయ్యను నియమించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై జరగుతున్న అసమానతలు, దాడులను ఖండించాలన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని ప్రతి గ్రామ, గ్రామాన తెలపాలని కోరారు. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగుల రాజు, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సమ్మయ్యనాయక్, మల్లేష్, సమ్మయ్య, రాములు, ప్రభాకర్, ముత్తయ్య, కిషన్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతితో గ్రామంలో విషాదం



వాజేడు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ స్వగ్రామం పెద్ద గొల్ల గూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వాజేడు మండలం పెద్ద గొల్ల గూడెం గ్రామానికి చెందిన పాడెం కోటేశ్వరరావు(40) ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఇంటిలిజెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులను నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్ ఢీ కొట్టింది. దీంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని పెద్దగొల్ల గూడెం గ్రామంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంతిమ సంస్కార కార్యక్రమానికి ఇంటిలిజెన్స్ సీఐలు హరికృష్ణ, తిరుపతి, వెంకటాపురం(కె) ఎస్సై అశోక్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చారు. మృతుడికి భార్య సౌజన్య, కొడుకు ఉన్నారు.

తాగు నీటి కోసం నిర్మించిన వాటర్ ట్యాంకులు



సమ్మక్క తల్లిని తీసుకువచ్చే పురేడు గుట్ట



సారలమ్మ గద్దె





సమ్మక్క గద్దె

జాతరకు సర్వం సిద్ధం

- పురేడుగుట్ట తల్లులను దర్శించుకోనున్న లక్షలాది మంది భక్తులు
- ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు
- తల్లుల రాక కోసం భక్తుల ఎదురుచూపు

చిట్యాల: మండలంలోని మారుమూల ప్రాంతమైన వెంచరామి శివారు పురేడు గుట్ట వద్ద రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు అధికారులు, పాలకవర్గ సభ్యులు, మండల నాయకులు సర్వం సిద్ధం చేశారు. ఈ జాతరకు వరంగల్, కరీంనగర్ , పెద్దపెల్లి, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సుమారు రూ.30 లక్షల నిధులను కేటాయించారు. దీంతో వెంచరామి గ్రామం నుంచి జాతర వరకు మట్టి రోడ్డు పోయించారు. అలాగే జాతర నుంచి మానేరు వాగు మీదుగా వచ్చే భక్తులకు కాల్వపల్లి వరకు మట్టి రోడ్డు సౌకర్యం కల్పించారు. అలాగే తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్ కాంతులతో విరజిల్లే విధంగా ఎన్నడూ లేనంతగా నాలుగు ఎల్ఈడీ సెంట్రల్ లైటింగ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల కోసం స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన షవర్స్



భక్తుల కోసం రోడ్డు సౌకర్యం ఏర్పాటు

తల్లులను తీసుకువచ్చేది వీరే..

ఈనెల 21న బుధవారం సారలమ్మ తల్లిని సార్ల ఓదేలు తీసుకొని వస్తారు. 22న గురువారం సమ్మక్క తల్లిని గోగ్గెల ప్రవీన్, పోలం నర్సయ్యలు తీసుకుని వచ్చి గద్దెలపై ఉంచుతారు. అలాగే 23న శుక్రవారం భక్తులు మొక్కుబడులు చెల్లిస్తారు. అనంతరం 24న శనివారం తిరిగి వన దేవతలు వన ప్రవేశం చేస్తారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు చేశాం..



వనదేవతలైన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర కమిటీకి చైర్మన్ కావడం అదృష్టం. ఈ జాతరకు ఐదు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అందరికి సౌకర్యాలు అందేలా కృషి చేస్తా. అలాగే నాతో ఉన్న కమిటీ సభ్యులకు, జాతరకు ఏర్పాట్ల కోసం నిధులు కేటాయించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు. మినీ జాతరకు వచ్చే భక్తులకు భూపాలపల్లి, పరకాల, హనుమకొండ నుంచి కాల్వపల్లి, గిద్దెముతారం వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశాం. అలాగే గోదావరిఖని, మంథని, పెద్దపల్లి నుంచి వచ్చే భక్తులకు ఓడేడ్ గ్రామం వరకు, అలాగే అడవి శ్రీరాంపూర్ వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తల్లుల దీవెనలు పొందాలి.

– మురళి, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై ఎండీ.శాఖాన్

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ శివారులో సెకండ్ ఎస్సై ఎండీ.శాఖాన్ ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. జాతర సందర్భంగా వాహనాలను నెమ్మదిగా నడపాలని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది అస్లాం జానీ, రాజయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్డుకిందకు దూసుకుపోయిన కారు



మంగపేట: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని కోడలు చెరువు పోతురాజుస్వామి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక లారీని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కుటుంబ సభ్యులు వారి బంధువులతో కలిసి మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని కారులో ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కోడలు చెరువు మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు కిందకి పంట కాలువలోకి దూసుకుపోయింది. కారు పాక్షికంగా ధ్వంసం కాగా అందులో ఉన్న ఆరుగురిలో ఎవరికీ గాయాలు కాలేదు.

జిల్లా కేంద్రంలో బారికేడ్ల ఏర్పాటు



ఏర్పాటు చేసిన బారికేడ్లు

ములుగు: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. మేడారం మహాజాతరకు వచ్చే వాహనాల రద్దీ పెరుగడంతో పాటు వాహనదారులు అతివేగంగా దూసుకువస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం అర్ధరాత్రి వాజేడు మండలానికి చెందిన పాడెం కోటేశ్వరరావు(40) రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చి బస్సు ఢీ కొట్టడంతో మృతి చెందాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఎదుట, బండారుపల్లి క్రాస్ వద్ద, మజీద్ ఎదుట, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే జంక్షన్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాహనదారులు యూ టర్న్ తీసుకోవడానికి దూరం వెళ్లాల్సి వస్తుందని నిబంధనలను పట్టించుకోకుండా బారి కేడ్లను తొలగించి వెళ్తున్నారు.

ప్రమాదాలు నివారణ అందరి బాధ్యత

రోడ్డు ప్రమాదాలను నివారించడం మన అందరి బాధ్యత అని సేవాలాల్ సేన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్ నాయక్ అన్నారు. మేడారం మహా జాతర సందర్భంగా వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను వాహనదారులు తొలగించి వెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. దీని మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సూర్య

మంగపేట: మండలంలోని రమణక్కపేటకు చెందిన గ్రీస్మంత్ ఇటీవల ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మహబూబబాద్ పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జ్ సూర్య ఆదివారం పరామర్శించి రూ 5000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపల్లి శివప్రసాద్, ప్రచార కార్యదర్శి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ బాలకృష్ణ, కర్రి నాగేంద్ర బాబు, కొంకతి సాంబశివరావు, లక్ష్మణ్‌రావు నాయకులు బాబూరావు, సత్యనారాయణ, లవకుమార్, చంద్రమోహన్, అనిల్, నాగసతీష్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్

ఏటూరునాగారం: మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ సర్వీస్‌లను వినియోగించుకోవాలని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్తుపల్లి డిపో ఆధ్వర్యంలో మేడారం సర్వీసులను ఏటూరునాగారం నుంచి ఏర్పాటు చేశారు. ఈ సర్వీసులను ఎస్సై హాజరై ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ సత్తుపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ విజయ శ్రీ మాట్లాడుతూ.. 26 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. పెద్ద వారికి రూ. 80లు, ఆఫ్ టికెట్ రూ.50లు ఉందని, మహాలక్ష్మీ పథకం వర్తిస్తుందన్నారు. ఈనెల 24 వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఐ వీడీ రెడ్డి, ఇన్‌చార్జ్ వెంకటయ్య, ఎస్ఆర్ కృష్ణ, కిన్నెర ఆనంద్, కాంతారావు, కంట్రోలర్ శంకర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మొగుళ్లపల్లి: దూపదీప నైవేద్య అర్చకులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల మహాదేవు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 20న మధ్యాహ్నం తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రతీ ధూపదీప నైవేద్య అర్చకులు హాజరై జయప్రదం చేయాలన్నారు. జీవన వ్యయం పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే ఆరు వేల గౌరవ వేతనం సరిపోవడం లేదన్నారు. అవికూడా రెగ్యులర్‌గా ఇవ్వకపోవడంతో అర్చకుడి కుటుంబ పోషణకు, దేవునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రతలు ప్రధాన ఎజెండాగా శాంతియుతంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలకు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. హాజరయ్యే అర్చక సంఘం నాయకులు గానీ అర్చకులు గానీ ఎలాంటి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా పూర్తి సమన్వయంతో శాంతియుతంగా పాల్గొనాలని కోరారు.

అనర్హుల పేర్లతో లెటర్ ప్యాడ్

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి–ముల్కలపల్లి గ్రామాల మధ్యన నిర్వహించే శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీలో అనర్హుల పేర్లతో లెటర్ ప్యాడ్ ముద్రించడంతో జాతర కమిటీ డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1977 సంవత్సరంలో ముల్కలపల్లి, మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన కొంతమంది వనదేవతలైన శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణ కోసం డైరెక్టర్లుగా, సభ్యులుగా చేరి.. కొంత రుసుంతో సభ్యత్వం పొంది జాతర కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. జాతర ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకునేందుకు తీర్మానం చేసుకున్నామని, అప్పటి నుంచి ఒక మారు జాతర కమిటీ చైర్మన్ పదవిని ముల్కలపల్లి గ్రామానికి కేటాయిస్తే..మరోమారు మొగుళ్లపల్లికి కేటాయించేలా ఒప్పందం చేసుకున్నామని డైరెక్టర్లు తెలిపారు. కానీ ఈనెల 21 ప్రారంభమయ్యే జాతర కమిటీలో జాతర కమిటీని ఏర్పాటు చేసుకున్నప్పటికీ, ఆ కమిటీని కాదని.. అనర్హుల పేర్లతో, జాతర ఉత్సవాలకు సంబంధం లేని వారితో లెటర్ ప్యాడ్ ముద్రించడం ఏంటని డైరెక్టర్లు ప్రశ్నిస్తున్నారు. కాగా, ఈ జాతర కమిటీలో రాజకీయ నాయకుల జోక్యం మరింత ఎక్కువవ్వడంతో జాతర ఉత్సవాలు సజావుగా జరిగేలా లేవని గ్రామాలలో చర్చించుకోవడం గమనార్హం. కాగా రెండు గ్రామాల డైరెక్టర్లు ఎవరికి వారుగా చీలి వేర్వేరుగా వనదేవతల జాతర నిర్వహణ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికైనా రాజకీయం నాయకుల జోక్యం తగదని, రాజకీయ నాయకుల జోక్యంతో గిరిజన దేవతల జాతర సజావుగా జరగకుండా గొడవలు సృష్టించే విధంగా ఉన్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. అనర్హుల పేర్లను తొలగించాలంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖ ఉద్యోగులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కోటేశ్వర్

మంగపేట: అటవీ రక్షణలో అహర్నిషలు పనిచేస్తున్న అటవీశాఖ ఉద్యోగుల శ్రమను గుర్తించి రాబోయే పీఆర్‌సీలో సముచిత స్థానం కల్పించాలని మంగపేట డిప్యుటీ రేంజ్ అధికారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి కోటేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పీఆర్‌సీలో అటవి శాఖ ఉద్యోగులకు సరైన వేతనం లేని కారణంగా ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఉద్యోగ బాధ్యతలో భాగంగా ఎల్లప్పుడు అటవీలో పోడుదారులతో, స్మగ్లర్లు, వేటగాళ్లతో ఇతర అసాంఘిక శక్తులతో నిత్యం ఘర్షణ అనుభవిస్తు కుటుంబాలకు, పిల్లలకు దూరంగా ఉండాల్సి రావడంతో మానసికంగా వేదనకు గురవుతున్నారన్నారు. జంతువుల సంరక్షణ, టూరిజం డెవలప్‌మెంటు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, మరెన్నో ఇంజనీరింగ్ పనులను సైతం చూస్తున్నా కష్టానికి తగిన విధంగా వేతనాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా అటవీశాఖ ఉద్యోగాల్లో చేరిన ఏజెన్సీ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ కల్పించాలని, సంవత్సరానికి రెండు దఫాలుగా యూనిఫాం అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఏ ఉద్యోగులకు లేని విధంగా ప్రజలకు సేవచేసిన జీతాల్లో డబ్బులు కోతకోసే వ్యవస్థ అటవీ శాఖలో ఉందన్నారు. ఈ పీఆర్‌సీలో నైనా తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న శ్రీనుబాబు

కాటారం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. కాటారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీపాద స్మారక జీపీఎల్–1 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం మండల కేంద్రంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. క్రీడల వలన మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయం ఆటలు, వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. క్రీడాపోటీలు, టోర్నమెంట్లు క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికితీసి ప్రతిభను చాటుకోవడానికి ఓ వేదికలా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఎనలేని క్రీడా ప్రతిభ ఉంటుందని వారికి తగిన ప్రోత్సాహం అందిస్తామని శ్రీనుబాబు తెలిపారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సీఐ నాగార్జునరావు, యూత్ అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్

టేకుమట్ల: చలివాగు, మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. ఆదివారం కలికోట శివారు మానురు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్, ఓనర్ భూపాలపల్లి మండలం నేరేడుపల్లికి చెందిన పుట్టపాక దేవేందర్, మెట్టు రజినీకాంత్, రేగొండ మండలం దమ్మన్నపేటకు చెందిన నడిపెల్లి శ్రీనివాస్‌రావులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా నేరమని ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా అనుమతి పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని తాళ్లగడ్డ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పూనెం సతీష్ అనే వ్యక్తి బైక్‌పై ఏటూరునాగారం వస్తుండగా మణుగూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్ బస్సు కిందికి వెళ్లింది. ద్విచక్రవాహనదారుడు చాకచక్యంగా తప్పించుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొంత మేర ట్రాఫిక్ నెలకొనడంతో పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేశారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

వాహనదారులు జాగ్రత్తగా నడపాలి

మేడారం వెళ్లే భక్తులు, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆదివారం పలువురు యువకులకు అవగాహన కల్పించారు. బైక్ మీద వెళ్లే వారు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరారు.

ప్రశాంతంగా సీఓఈ పరీక్ష



విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న ఇన్విజిలేటర్లు

కాటారం: గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశం కోసం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఆదివారం నిర్వహించిన సీఓఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో వంద మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 99 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శైలజారాణి, డిపార్టుమెంటల్ ఆఫీసర్ జే.కే.బుచ్చయ్య తెలిపారు. పరీక్షకు హాజరయ్యే ముందు విద్యార్థుల హాల్‌టికెట్లు, ఇతర సామాగ్రిని ఇన్విజిలేటర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు.